క్లుప్తంగా

'రౌడీయిజం చేస్తే చిప్పకూడు'


కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: రౌడీయిజం చేస్తే జైల్లో చిప్పకూడు తప్పదని ఏసీపీ ప్రకాశ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని రౌడీషీటర్లకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రవర్తన మార్చుకుని సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న వారికి పోలీసుల సహకారం ఉంటుందన్నారు.

శ్రీరాంపూర్ సీఐకి ప్రశంసలు


ప్రశంసాపత్రం అందుకుంటున్న వేణుచందర్

శ్రీరాంపూర్: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కమిషనరేట్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రామగుండం కమిషనరేట్‌లో శుక్రవారం సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని తీసుకున్నారు.

'నిర్వాసిత గ్రామస్తుల సమస్యలు పరిష్కరిస్తాం'


గ్రామస్తులతో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

కాసిపేట: కళ్యాణిఖని ఓపెన్‌కాస్టు నిర్వాసిత గ్రామస్తుల సమస్యలు పరిష్కరిస్తామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఓసీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో పర్యటించారు. గ్రామంలో నీటి వనరులను పరిశీలించారు. గ్రామస్తులు తమ సమస్యలు వివరించారు. జీఎం మాట్లాడుతూ త్వరలోనె సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఏరియా సివిల్ ఎస్ఈ రాము, ఈఈ ప్రకాశ్, ఎస్టేట్ ఆఫీసర్ నవనీత ఉన్నారు.

'టింబర్ యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీరాంపూర్: టింబర్ యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లోని టింబర్ యార్డును సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఇతర కార్మికుల మాదిరిగా వేతనాలు, సౌకర్యాలు, అలవెన్స్‌లు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, నాయకులు నోముల బాలయ్య, పల్లె క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పత్తి విత్తనాలపై అవగాహన

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలపై శుక్రవారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను క్రయవిక్రయాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

జన్నారం: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేయగా కొత్తపేట సమీపంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, ఇసుక తరలిస్తున్న డ్రైవర్ పూదరి రాజేందర్, ఇజాజోద్దీన్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయకార్యదర్శి పి.వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్సైల బదిలీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రామగుండం కమిషనరేట్‌లో పలువురు ఎస్సైలు బదిలీ అయ్యారు. హాజీపూర్ ఎస్‌హెచ్‌వో సురేష్ లక్సెట్టిపేటకు, స్వరూప్‌రాజ్ హాజీపూర్‌కు, లక్సెట్టిపేటలో పని చేస్తున్న సతీశ్ ఆసిఫాబాద్ జిల్లాకు, మంచిర్యాలలో పని చేస్తున్న వినీత రామగుండం(సీసీఆర్‌బీ)కు, మంచిర్యాలకు ఉపేందర్‌రావు, గోదావరిఖనిలో పని చేస్తున్న రామలక్ష్మి జైపూర్‌కు బదిలీ అయ్యారు. కాగా, హాజీపూర్ ఎస్సైగా స్వరూప్‌రాజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

రంగు మారిన నల్లా నీరు

- మున్సిపాలిటీలో మురుగునీటి సరఫరా
- అనారోగ్యం బారిన చిన్నారులు
- పట్టించుకోని అధికారులు


పసుపు రంగులో తాగునీరు


దొరల బంగ్లా ఏరియాలో లీకేజీ అవుతున్న తాగునీరు

మందమర్రిరూరల్: వేసవి కాలం మొదలు కాక ముందే ఎండలు దంచి కొడుతున్నాయి. ఇప్పటికే మంచి నీళ్ల ఇక్కట్లు తప్పడం లేదు. ఇలాంటి సమయంలో మున్సిపాలిటీలో మురికి నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో వార్డులకు మున్సిపాలిటీ సప్లయ్ చేస్తున్న తాగునీరు మురికి నీటిని తలపిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు, ఊరు రామకృష్ణాపూర్ గ్రామానికి మున్సిపాలిటీ నుంచి వచ్చే నీరు రంగు మారుతోంది. రంగు మారడంతో పాటు నీరు దుర్వాసన కూడా వస్తోంది. ఈ నీటిని నిత్యం తాగడంతో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆ నీటిని తాగిన చిన్న పి ల్లలు జ్వరం, వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలకు ఏమైందో తెలి యక తల్లిదండ్రులు ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీలు..

మున్సిపాలిటీ మంచి నీటిని సరఫరా చేసేటప్పుడు లీకేజీల ద్వారా నీరు వృథాగా చాలా చోట్లలో బయటకు వచ్చి రోడ్లపై పారుతోంది. ఈ మంచి నీళ్ల పైపులైన్ల లీకేజీలు ఎక్కువగా ఉండటంతో మట్టి, మురికి నీరు వస్తోంది. అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నా నిర్లక్ష్యంగానే వదిలేస్తున్నారు.

మురికి నీరు వస్తోంది



మా ఊరికి చాలా రోజులుగా మంచి నీళ్లు మురికిగానే వస్తున్నాయి. రంగు మారి, దుర్వాసన వస్తున్నాయి. రోజూ వచ్చే మంచి నీళ్లు కొన్నిరోజులుగా దినం విడిచి దినం వదులుతున్నారు. అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేసి ప్రతిరోజు మంచి నీటిని సరఫరా చేయాలి. - శివ, ఊరు రామకృష్ణాపూర్

అధికారులు పట్టించుకోవాలి



తాగునీరు రోజు తరువాత రోజు ఇస్తున్నారు. అవి కూడా మురికి నీరు, దుర్వాసనగా వస్తున్నాయి. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు ఆ నీరు తాగి నిత్యం అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి. - భీమ కిరణ్, ఊరు రామకృష్ణాపూర్

ప్రజా సమస్యలపై పోరాటం


దండేపల్లి: ర్యాలీ చేస్తున్న సంఘాల నాయకులు

చెన్నూర్: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 15 నుంచి 21 వరకు ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో పాటు జిల్లాలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 21న చలో మంచిర్యాల కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నాయకులు చందు, అశోక్, ఉమారాణి, లింగన్న, రంజిత్‌కుమార్, సమ్మక్క, రమాదేవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశయ్య డిమాండ్ చేశారు. దండేపల్లిలో శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘాలతో కలిసి ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సంధ్యారాణికి అందించారు. నాయకులు సంకె రవి, అశోక్, చందు, రంజిత్ కుమార్, ఎస్కే అబ్దుల్లా, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు శ్యామల, ఉమారాణి ఐద్వ మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెన్నెల: మండలంలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజన్న తెలిపారు. 33 కేవీ కన్నెపల్లి లైన్ మెయింటనెన్స్ పనుల్లో భాగంగా నందులపల్లి, గన్‌పూర్, జోగాపూర్, గొల్లపల్లి, మైలారం, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, కోణంపేట, కుశ్నపల్లి, బొప్పారం గ్రామాలతో పాటు నెన్నెల గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

జయంతి ఘనంగా జరుపుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లాలో మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో దళిత కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం మండల ఇన్‌చార్జీల నియామకం చేపట్టారు. హాజీపూర్, దండేపల్లి, తాండూర్ మండలాల ఇన్‌చార్జిగా జాడి రాంచందర్, మంచిర్యాల గోళ్ల రాజమల్లు, నస్పూర్‌కు చిప్పకుర్తి నారాయణ, లక్సెట్టిపేటకు తాళ్లపల్లి రాజేశ్వర్, జన్నారం తొగరి రాజు, జైపూర్ అంబాల రాజేశ్, కోటపల్లి దమ్మనారాయణ, భీమారం బోనాస స్వామి, మందమర్రి చిన్నయ్య, బెల్లంపల్లి, కాసిపేట మండలాలకు దుర్గం ఎల్లయ్య, భీమిని మారుపాక మల్లేశ్, కన్నెపల్లి రాయలింగు, మంచిర్యాల మున్సిపాలిటికి పరమేష్, నస్పూర్ మున్సిపాలిటికి మాడుగుల మహేశ్‌లను నియమించారు.

బాధిత కుటుంబానికి సరుకులు పంపిణీ

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన వెంకటి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు వాసాల సంపత్ పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ పట్టణానికి చెందిన ప్రముఖ గోల్డ్‌స్మిత్ వ్యాపారి సద్దనపు వేణుగోపాల్ సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న 60మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్ఎం సత్యారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నూర్: వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా వేసవి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీఈ బాలకృష్ణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో 63కేవీఏ డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఏఈ కె.శ్రీనివాస్, లైన్‌మెన్ రమేశ్ పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి ఆపరేషన్లు

భీమిని: మండలంలోని వృద్ధులకు మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, శ్రీరామ సేవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు నిర్వహించారు. గత నెల 22న ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయగా పలువురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 24, 25, 9వ వార్డు ప్రజలకు శుక్రవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ తెల్లరేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నెన్నెల: మండలంలోని కొత్తూర్, చిన్నవెంకటాపూర్ గ్రామాల్లోని ప్రజలకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్నబియ్యాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ మేకల మల్లేశ్, నాయకులు ఎండీ మహ్మద్ జలీల్, మాజీ సర్పంచ్ ఏనుక మల్లయ్యతో కలిసి పంపిణీ చేశారు.

ప్రజాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ప్రజాధర్నా కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మల్లేశ్, వెంకటేశ్, అప్పారావు, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు సన్మానం

జన్నారం: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి, హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది బదిలీ అయిన భాస్కర్, సురేశ్‌లను ఎస్సై రాజవర్ధన్ సన్మానించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

తాండూర్: వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంతో శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఐబీ కేంద్రం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, విజయ్‌కుమార్, తుకారాం, సురేశ్, మల్లేశ్, నాగభూషణ్, చంద్రయ్య, చందు, రమేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. నాయకులు ఆరుముళ్ల పోషం, అశోక్, ధన్‌సింగ్, వేణు, ఈశ్వరాచారి పాల్గొన్నారు.

పాడే మోసిన చిన్నయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దాసరి రాజం గురువారం రాత్రి మృతి చెందాడు. టీబీజీకేఎస్ నాయకుడు దాసరి శ్రీనివాస్ తండ్రి రాజం మరణవార్త తెలియగానే మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భౌతిక కాయాన్ని సందర్శించారు. అంత్యక్రియల్లో రాజం పాడే మోశారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

రామకృష్ణాపూర్: ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్సై రాజశేఖర్ సూచించారు. క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

క్రైం కార్నర్..

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జన్నారం: జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలమడుగు గ్రామ శివారు కోళ్లఫారంలో పేకా ట స్థావరంపై పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.62 వేలు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజవర్ధన్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేవోజీపేటకు చెందిన గుంజి వెంకటేష్, మతులాపురం కృష్ణ, గోడిసెరాలకు చెందిన కొంపల్లి నర్సయ్య, బుట్టాపూర్‌కు చెందిన బండెల శంకర్, జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన తిర్రి శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాముల రాజేశం, పోతుగంటి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ యాసీన్‌లను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నలుగురి అరెస్టు

వేమనపల్లి: గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన నలుగురిని నీల్వాయి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజారాం గ్రామానికి చెందిన జంబి మల్లయ్య, అతని తోడల్లుడు బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన బాలెపల్లి సుధాకర్, బెల్లంపల్లికి చెందిన ముత్యం మధు, అతడి బావమరిది నల్ల కుమార్ కలిసి గుప్త నిధుల తవ్వకాల కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. జంబి మల్లయ్య పెరట్లో గుప్త నిధులు ఉన్నాయని, వెలికితీయడానికి మంత్రశక్తి ఉపయోగించి నిధిని గుర్తించాలని అనుకున్నారు. రూ.30 వేలు ఇస్తామని మాట్లాడుకుని గురువారం రాత్రి తాంత్రికుడు మధు, కుమార్ సహాయంతో మల్లయ్య, సుధాకర్ రాత్రి 11 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు గుంత తవ్వారు. ఎలాంటి నిధి లభ్యం కాకపోగా, తవ్వకాల విషయమై చుట్టుపక్కల వారు నిలదీశారు. గ్రామస్తులు నీల్వాయి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్యాంపటేల్ ఘటన స్థలానికి చేరుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

'ఆర్టీసీ రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి'

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట టీజీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు రిటైర్మెంట్ తర్వాత యాజమాన్యం నుంచి వచ్చే అదనపు ఆదాయం ఏమీలేదన్నారు. రిటైర్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. గత 3 సంవత్సరాలుగా రిటైర్ అయిన ఏ ఒక్కరికి కూడా లీవు ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించలేదని ఆరోపించారు. ఎంఎస్ పాషా, ప్రకాశ్, ఎంఎస్‌రెడ్డి, మాణిక్యం, ముబారక్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1975లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా 45 మంది పూర్వ విద్యార్థులు కలిసి వారి జ్ఞాపకాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు 30 కుర్చీలు, 80 మంది విద్యార్థులకు డిక్షనరీలు అందించారు.

ఆశ కార్యకర్తలకు అవగాహన


ఆశవర్కర్లతో మహిళ సాధికారత సభ్యులు

జన్నారం: మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఆశ కార్యకర్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఫైనాన్స్ లీటరసీ లిప్సికలతో పాటు మెడికల్ ఆఫీసర్ ఉమాలు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. భేటీ బచావో -భేటీ పడావో పథకం, గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం, లింగవివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 1930, సఖి సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14567, పోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నంబర్ 112, సుకన్య సమృద్ధి యోజన, మిషన్ వాత్సల్య, ఆడపిల్లల ప్రాముఖ్యత తదితర అంశాలపై ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ దీక్షలో యువత

- తండాల్లో ఆధ్యాత్మిక సందడి
- గిరిజనుల్లో వెల్లివిరుస్తున్న భక్తి


దీక్షలు తీసుకున్న గిరిజన యువకులు

నెన్నెల: సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్షలతో యువతలో భక్తిభావం వెల్లివిరుస్తోంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిజనులు తమ ఆరాధ్య గురువు సేవాలాల్ మహారాజ్ దీక్షలు చేపట్టారు. శ్రీరామనవమి వరకు 41 రోజులపాటు భక్తిశ్రద్ధలతో మండల దీక్షలు కొనసాగుతాయి. భక్తుల వీలును బట్టి మండలం(11 రోజులు), అర్ధ మండలం(21 రోజులు), పూర్ణ మండలం(41 రోజులు) పాటు మాలధారణ చేశారు. జిల్లాలోని నెన్నెల, బెల్లంపల్లి, మందమర్రి, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని 18 తండాల్లో 30 నుంచి 40 మంది యువకులు దీక్షలు తీసుకున్నారు. సుమారు వెయ్యి మందికిపైగా దీక్షలో ఉన్నారు. శ్రీరామ నవమికి మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా పౌరాగఢ్‌లో రామారావు మహరాజ్ సంస్థాన్ ఆదేశానుసారంగా మాలలు ధరించి దీక్షలు చేపడుతారు. అక్కడే కుటుంబ సభ్యులంతా కలిసి దీక్ష విరమణ చేస్తారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తగా నిర్మాణం చేసిన సీసీరోడ్డును ప్రారంభించారు. గోపాల్‌నగర్ గ్రామంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ గ్రామంలో కొందరు ఇళ్ల కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్సై సౌజన్య, డెప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, కాంగ్రెస్ నాయకులు ఎస్.మహేందర్ రావు, బానయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పేద ప్రజల ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నాలగ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు స్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మహేశ్, రమేశ్, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ డీఈ, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర


జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని 23, 24, 33 వార్డుల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, మాజీ వైస్‌చైర్మన్ మహేశ్, వేములపల్లి సంజీవ్, బానేశ్, సంజీవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రజిత, పట్టణ అధ్యక్షురాలు హేమలత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుంధర పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్, గుడిపేట, నంనూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని బాపూజీ, అంబేద్కర్, సంవిధాన్ చిత్రపటాల సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాసగౌడ్ నాయకులు ఉన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 4, 5, 10, 11వ వార్డులలో కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన బాటలో నడుస్తూ, భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. నాయకులు అరీఫ్, అశోక్, స్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా హనుమాన్ భక్తుల శోభాయాత్ర

దండేపల్లి: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మండలంలోని మేదరిపేట నుంచి ముత్యంపేట వరకు హనుమాన్ దీక్షాస్వాములు శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పాల్గొన్నారు. శోభాయాత్రలో స్వాములు భక్తిపాటలకు చేసిన నృత్యాలు, భజనలు ఎంతగానో అలరించాయి. అనంతరం ముత్యంపేటలో స్వాములు ప్రత్యేక పూజలు చేసి, చాలీసా, దండకం పఠించారు. సంతోష్, సురేందర్, రాజయ్య, శ్రీనివాస్, గురువయ్య, సురేశ్, శేఖర్, వెంకటేశ్, సురేందర్, సత్యనారాయణ, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. మందమర్రికి చెందిన వేద పండితులు అనంతచార్యుల బృందం అధ్వర్యంలో ప్రతిష్ఠాపన క్రతువు నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వేమనపల్లి: మండలంలోని బొమ్మెన గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా ముగిసింది. రెండు రోజులుగా కార్యక్రమం కొనసాగుతుండగా ఉదయం లక్ష్మీగణపతి, నవగ్రహ, వాస్తు, రుద్రహోమాలు నిర్వహించారు. వేద పండితులు ముద్దు నరహరిశర్మ ఆధ్వర్యంలో యంత్ర విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం బలిదానం, మహాపూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పూజలు ప్రారంభం..

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ, దాసాంజనేయ నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యంత్రప్రతిష్ఠాపకులు, పురోహిత బ్రహ్మ శ్రీవేమునూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు వైభవోపేతంగా నిర్వహించారు.

నేటి నుంచి మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి పునరావాస కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీశివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.